ప్రజాశక్తి

సోమవారం 24 మార్చి 2025 | 8 పేజీలు






ఎన్‌టిఆర్ | కృష్ణా

భారాలు తప్పవా..?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తగ్గుతున్న నిధులు
- ప్రజలపై పన్నులే గతి..!
- పొంతన లేని విఎంసి రాబడులు, ఖర్చులు

ప్రజాశక్తి-విజయవాడ

నగరాభివృద్ధిని విస్మరించి, భారాలు మోపే దిశగా నూతన బడ్జెట్ (2025-26) ఉంది. వివిధ పన్నుల రూపంలో వందల కోట్లు ప్రజల నుంచి వసూలు చేస్తూ... ఆ సొమ్మును తిరిగి ప్రజల అవసరాలకు, నగరాభివృద్ధికి ఉపయోగించే పరిస్థితి లేకుండా పోయిందని శనివారం ఆమోదం పొందిన బడ్జెట్ తీరు తెన్నులు విధితం చేస్తుంది. మరో వారం రోజుల్లో ముగియనున్న ప్రస్తుత బడ్జెట్‌లో పేర్కొన్న అంచనాలు, రాబోయే నూతన బడ్జెట్‌లోని అంచనాలను పరిశీలిస్తే .. తిరోగమనం వైపు నగర పరిస్థితి తయారయింది. పెరుగుతున్న అవసరాలకనుగుణంగా 2025-26 బడ్జెట్ అంచనాలు పెరగాల్సింది పోయి క్రమంగా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్స్ రూపంలో నగరపాలక సంస్థకు న్యాయబద్దంగా, రాజ్యాంగ బద్దంగా విడుదల కావాల్సిన నిధులు రావడం లేదని బడ్జెట్‌లో పొందుపరిచిన అంచనాలే విధితం చేస్తున్నాయి. ఫలితంగా నగర ప్రజలపై వందల కోట్లు భారాలు మోత మోగనున్నది. దీనంతటికీ ముఖ్య కారణం నగరపాలక సంస్థలో ఏర్పడిన రాజకీయ అనిశ్చితి, కౌన్సిల్‌లోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షంలోని కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధుల, కార్పొరేటర్ల బాధ్యతారాహిత్యం, వారి స్వలాభం వెరసి, నగరాభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో క్యాపిటల్ ఆదాయాలకు వచ్చేసరికి రూ. 454.15 కోట్లు రావచ్చునని అంచనా వేశారు. కానీ ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.501.41 కోట్లుకు గాను సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ. కేవలం 292.07 కోట్లు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చాయి. వీటిల్లో రూ. 200 కోట్లకు పైగా గ్రాంట్స్ రూపంలో ప్రభుత్వాల నుంచి రాకుండా నిలిచిపోయాయి.



పెరుగుతున్న నగర అవసరాలు- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి న్యాయబద్దంగా రావాల్సిన గ్రాంట్స్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది కన్నా ...వచ్చే ఆర్థిక సంవత్సరానికి క్యాప్టిల్ ఆదాయాల అంచనాలను పెంచే సాహసం అధికార వైసిపి చేయలేకపోయింది. అలాగే వాస్తవ రాబడికి...ఖర్చులకు కూడా పొంతన ఉండటం లేదని బడ్జెట్ అంచనాలు తేటతెల్లంచేస్తున్నాయి. క్యాపిటల్ ఖర్చుల్లో రాబోయే ఏడాదికి రూ. 691.77 కోట్లుగా చూపించారు. అయితే ఈ ఏడాది (2024-25) బడ్జెట్‌లోని క్యాపిటల్ ఖర్చుల కింద రూ. 779.93 కోట్లు అంచనా వేయగా, సవరించిన అంచనాల బడ్జెట్ ప్రకారం ఖర్చు చేసింది కేవలం రూ. 314.48 కోట్లే. ఖర్చుల్లో కూడా 465.45 కోట్లు మేర నిధులు తగ్గిపోయాయి. రాబోయే ఏడాదికి రూ. 1309.52 కోట్లు వాస్తవ రాబడిగా, రూ. 1454.56 కోట్లు ఖర్చులుగా అంచనా వేశారు. ఆదాయాలు కన్నా ఖర్చులే ఎక్కువ చూపించారంటే...వాటిని భర్తీ చేసుకోవాలంటే తప్పని సరిగా ప్రజలపై భారం మోపక తప్పదు. రాబోయే ఏడాదికి జనరల్ పన్నుల కింద రూ. 20 కోట్లు అదనంగా వసూలు చేయాలని నిర్ణయించారు. అలాగే ఖాళీ స్థలాల పన్నులు రూ. రెండు కోట్లకు పైగా పెంచారు. వృత్తి పన్ను రూ. నాలుగు కోట్లు అదనంగా వసూలు చేయాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులను రాబట్టడంలో విఫలమవుతున్న అధికార వైసిపి, కూటమి ప్రభుత్వంనకు చెందిన ప్రజాప్రతినిధులు, అత్యవసరమైన, ప్రజాసంక్షేమానికి, నగరాభివృద్ధికి సంబందించిన పలు పద్దులకు నిధులు (మిగతా 2లో)



పోలీసులతో మాట్లాడుతున్న పేదలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఇళ్లస్థలాల కోసం కొనసాగుతున్న ఆందోళన

విజయవాడ రూరల్ : మండలంలోని పి.నైనవరం గ్రామంలో పేదల ఆందోళన కొనసాగుతోంది. నివేశన స్థలాల కోసం వివిధ సామాజిక వర్గాల నిరుపేద మహిళలు నాలుగో రోజు ఆదివారం కూడా వ్యవసాయ కార్మిక సంఘం పతాకాలతో పెద్ద సంఖ్యలో వచ్చి ఆందోళనకు పూనుకున్నారు. వీఆర్వో, పోలీస్ అధికారులు ఆందోళన ప్రాంతం వద్దకు వచ్చారు. ప్రభుత్వం వెంటనే కుక్కలవానికుంటలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని.. లేకుంటే గతంలో ప్రభుత్వమే తేల్చిన లబ్ధిదారుల జాబితా ప్రాతిపదికన తామే స్వాధీనం చేసుకుంటామని ఇళ్ల స్థలాల ఆందోళన కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉన్నతాధికారులకు ఇప్పటికే పలుమార్లు విన్నవించుకున్న (మిగతా 2లో)

14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

- అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన
- కృష్ణాజిల్లా అగ్నిమాపక అధికారి డి.ఏసురత్నం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

అగ్ని ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా అగ్నిమాపక అధికారి డి.ఏసురత్నం తెలిపారు. విద్యుత్ షార్టు సర్క్యూట్, గ్యాస్ సిలిండర్ల లీకేజీ తదితర కారణాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ వారోత్సవాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏసురత్నం చెప్పారు.





ప్రశ్న: అగ్నిప్రమాదాలు ఎన్ని జరిగాయి? ఎంత ఆస్తి నష్టం సంభవించింది?

జవాబు: 2022 నుంచి 2025 మార్చి వరకు జిల్లాలోని తొమ్మిది అగ్నిమాపక కార్యాలయాల పరిధిలో 2,232 అగ్ని ప్రమాదాలు జరిగాయి. రూ. 18 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగింది. 2025 ఫిబ్రవరి నెలలో మచిలీపట్నం మండలం పోతేపల్లిలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.30 లక్షల విలువైన రోల్డ్ గోల్డ్ వస్తువులు కాలిపోయాయి. జనవరి 31న మొవ్వ మండలం కాజలో ఏడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. రూ.10 లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగింది. 2024 డిసెంబర్ 29న చల్లపల్లి మండలంలోని రామానగరం వద్ద కోస్టల్ ఫీడ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో రూ.30 లక్షలు, 2024 ఫిబ్రవరిలో వుయ్యూరు సమీపంలోని ఆకునూరు వద్ద స్క్రాబ్ దుకాణంలో రూ.25 లక్షలు నష్టం వాటిల్లింది.

ప్రశ్న: అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: గృహాలు, పరిశ్రమల్లోనూ, వ్యాపార దుకాణాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. గృహాల్లో ప్రమాదాల నియంత్రణకు ఇంటిని పరిశుభ్రంగా ఉంచాలి. చిన్నపిల్లకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, ఎలక్ట్రికల్ సామాగ్రి, ఇతర మండే పదార్థాలు అందుబాటులో ఉంచవద్దు. పక్క (మిగతా 2లో)



24-3-2025 సోమవారం

ఇఫ్తార్ (సాయంత్రం) : 6.24

25-03-2025 మంగళవారం

సహర్ (ఉదయం) : 4.50

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల స్ఫూర్తితో

సేవా, శ్రమదాన కార్యక్రమాలు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాబూరావు, రామన్న

ప్రజాశక్తి-విజయవాడ: దేశ స్వాతంత్ర్యం పోరాటంలో కేవలం 23 ఏళ్లకే ఉరి కంభాన్ని ముద్దాడి ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువత సేవా, శ్రమదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపునిచ్చారు. ఆదివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్థంతి వారోత్సవాల సందర్భంగా విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణా హోటల్ సెంటర్లో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్‌కు పాతర- డివైఎఫ్ఐ బాటరా, అవినీతిపై యుద్ధం - డివైఎఫ్ఐ సిద్ధం, నిరుద్యోగంపై సమరం - డివైఎఫ్ఐ నినాదం అంటూ సేవా, శ్రమదాన, రక్తదాన శిబిరాలు, (మిగతా 2లో)



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

పేదలకు ఇళ్లు కేటాయించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



గృహాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న గృహాలను పేదలకు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పశ్చిమ కార్యదర్శి బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గంలోని కబేళా సెంటర్‌లో ఏడు సంవత్సరాల క్రితమే నిర్మాణమై వృధాగా పడి ఉన్న జి ప్లస్ త్రీ గృహ సముదాయాన్ని సిపిఎం నేతలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకవైపున పేదలు ఇంటి అద్దెలు కట్టలేక నానా అవస్థలు పడుతుంటే మరోవైపు ప్రజాధనంతో నిర్మించిన పేదల గృహాలు పాలకుల నిర్లక్ష్యంతో క్షీణదశకు చేరుకున్నాయని అన్నారు. కబేళా సెంటర్‌లో గత ఏడు సంవత్సరాలుగా 300 గృహాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని నేటి వరకు పేదలకు కేటాయించలేదని అన్నారు. నేడు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా జెఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలు మారాయన్నారు. ఇళ్లన్నీ దెబ్బతిన్నాయని, కిటికీ అద్దాలు పగిలిపోయాయని, బురదతో నిండిపోయాయని, కట్టడాలు దెబ్బతింటున్నాయని, చెట్లు, మొక్కలతో అడవిని తలపిస్తున్నాయని తెలిపారు. 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వం, 2019-24 కాలంలో వైసిపి ప్రభుత్వం, గత తొమ్మిది నెలల కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు ఇళ్ల కేటాయింపులు చేయలేదన్నారు. లబ్ధిదారుల వాటా పేరుతో వేలాది రూపాయలు పేదల నుండి వసూలు చేశారని తెలిపారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి పాలకులు, ప్రజాప్రతినిధులు పేదల పట్ల తమ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ ఇళ్లను మరమ్మతు చేయడానికి, పునర్నిర్మాణానికి మళ్లీ ప్రజాధనం వినియోగించాల్సి ఉందన్నారు. కబేళా వద్ద 300 గృహాలు, అజిత్ సింగ్ నగర్‌లో రెండు వేల గృహాలు వృధాగా ఉన్నాయన్నారు. జక్కంపూడిలో నిర్మాణమైన ఆరు వేల ఇళ్లు అసంపూర్తిగా మిగిలాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అర్హులైన వారికి పారదర్శకంగా గృహాలు కేటాయించాలని, లేకపోతే లబ్ధిదారులే గృహాలను స్వాధీనం చేసుకుంటారని, వారికి సిపిఎం అండగా ఉంటుందని హెచ్చరించారు. ఈ నెల 28వ తేదీన పేదలకు ఇళ్లు ఇవ్వాలని, రెండు సెంట్లు స్థలాలు కేటాయించాలని, టిడ్కో గృహాలు వెంటనే అందించాలని కోరుతూ విజయవాడ కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాలో ప్రజలందరూ వేలాదిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు మస్తాన్, వెంకట్రావు, దాసు, దుర్గారావు, అప్పన్న, రఫీ తదితర నేతలు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

సేవా, శ్రమదాన కార్యక్రమాలు

కాగడాల ర్యాలీలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సదస్సులు, మెడికల్ క్యాంపులు, మొక్కలు నాటే కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తతంగా చేపట్టినట్లు తెలిపారు. నేడు దేశంలో అభివృద్ధి కొద్దిమందికి మాత్రమే అందుబాటులో ఉందని, కోట్లాది ప్రజలకు కొనుగోలు శక్తి కూడా లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, అవినీతి దేశాన్ని పట్టి పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాద, మతోన్మాద వ్యతిరేక పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యు.శివలింగేశ్వరరావు, షేక్ నిజాముద్దిన్, మహిళా సంఘం నాయకులు ఎస్‌కె దేవికుమారి, ఎస్ విజయలక్ష్మి, నాయకులు ఎస్.మల్లికార్జునరెడ్డి, ఎస్‌కె రసూల్, బి.యశ్వంత్ పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల కోసం కొనసాగుతున్న ఆందోళన

విషయాన్ని నాయకులు వారి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళావతి, జమున, దావు శ్రీనివాసరావు, సట్టు శ్రీనివాసరావు, మాతంగి ప్రసాద్, బూసి దుర్గారావు, సురేష్, అజయ్, బూసి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మాతంగి ఆంజనేయులు, కోట కల్యాణ్, ఏ వేంకటేశ్వరరావు, జి వి రంగారెడ్డి నాయకత్వం వహించారు.

14 నుండి అగ్నిమాపక వారోత్సవాలు

మీద పడుకుని పొగతాగడం, కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు అర్పకుండా అజాగ్రత్తగా పారవేయవద్దు.

ప్రశ్న: గ్యాస్ సిలెండర్‌లు ప్రమాదాలకు గురవ్వకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: సిలెండర్ మార్చినప్పుడల్లా రబ్బరు ట్యూబును పరీక్షించాలి. లీకేజీ కనపడినా, ట్యూబ్ చెడిపోయినా ఐఎస్ఐ మార్కుగల కొత్తట్యూబ్‌తో వెంటనే మార్చాలి. గ్యాస్ స్టవ్‌ను ఎల్లప్పుడు ఎత్తైన ఫ్లాట్‌ఫారం మీదనే ఉంచాలి. గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపాలి. స్టౌ మీద వంటకు పెట్టి బయటకు వెళ్లకూడదు. వండే పదార్థాలు పొంగి గ్యాస్ లీక్ అయి అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉంది. గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆపాలి. ఆ సమయంలో ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయరాదు. మీ గ్యాస్ స్టౌవ్‌లో రెగ్యులర్‌గా ఏదైనా ఇబ్బంది కల్గితే మీరు సొంతంగా రిపేరు చేయవద్దు. మీ గ్యాస్ డీలర్‌ను సంప్రదించండి. పిండి వంటలు కాగినప్పుడు నూనె కాగినదో లేదో చూడటానికి నీళ్లు చిలకరించ రాదు. దీని వల్ల అగ్ని ప్రమాదం సంబవించవచ్చు. బాణలిలో అగ్నిప్రమాదం జరిగితే వెంటనే మూతతో కప్పి వేయాలి. లేదా గోదుమ పిండి వంట సోడా బాణిలిలో గుమ్మరించాలి. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయకండి. వంటగదిలో కిరోసిన్ డీజిల్, పెట్రోలు, అదనపు గ్యాస్ సిలెండర్ వంటివి ఉంచవద్దు. వంట చేయునప్పుడు నూలు వస్త్రాలు ధరించాలి.

ప్రశ్న: విద్యుత్ వలన అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి?

జవాబు: ఐఎస్ఐ మార్కు గల ప్రామాణికమైన విద్యుత్ పరికరాలు మాత్రమే ఉపయోగించాలి. ఒకే ఎలక్ట్రిక్ పాయింట్‌లో ఎక్కువ ప్లగ్‌లు పెట్టడం ప్రమాదానికి దారితీస్తుంది. విద్యుత్ ఉపకరణాలపైఊ ఓవర్‌లోడ్ వేయకూడదు. విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పడానికి నీటిని ఉపయోగించకూడదు. పొడి ఇసుకను మాత్రమే వాడాలి.

ప్రశ్న: పాఠశాలలు, అసుపత్రుల్లో ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?

జవాబు: పాఠశాలలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాల్లో ఆర్‌సిసి కాంక్రీట్ స్లాబ్‌లు మాత్రమే కప్పులుగా వాడాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమన చోట ఏర్పాటు చేయాలి. సెల్లార్‌లో ఆటోమేటిక్ స్ప్రింక్లర్లను ఉపయోగించాలి. పాఠశాలలు, ఆసుపత్రుల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే తప్పించుకుని బయటకు వెళ్లేందుకు మెట్లు తలపుల వద్ద ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలి. గోదాములు, గిడ్డంగుల్లో స్టాక్‌ను చెక్క స్లిపర్ల మీద మాత్రమే నిల్వ ఉంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ తీగల దగ్గరలో గడ్డి వాములు వేయకూడదు. కర్మాగారాల్లో ఉద్యోగులకు బేసిక్ ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇప్పించాలి. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అగ్గిరవ్వలు, మిషనరీ బెల్ట్‌లు, పుల్లీలు, విద్యుత్ పరికరాల నుంచి రాలకుండా చూడాలి. వెల్డింగ్ కటింగ్ తదితర పనులు నైపుణ్యం కలిగిన వ్యక్తులను వినియోగించాలి. పాడైన విద్యుత్ వైర్లను ఉపయోగించరాదు.



గన్నవరంలో కాగడాల ప్రదర్శన

ప్రజాశక్తి-గన్నవరం: బ్రిటీష్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన దీశాలి భగత్ సింగ్ అని, ఆయన ఆశయాల బాటలో యువత నడవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపునిచ్చారు. గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. బైక్ ర్యాలీ సూరంపల్లి నుంచి ముస్తాబాద్, పురుషోత్తపట్నం, వి.ఎన్ పురం మీదుగా గన్నవరం చేరుకుంది. అనంతరం పట్టణంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. రామన్న మాట్లాడుతూ ధైర్యం అనే మాటకు నిలువెత్తు నిదర్శనం భగత్ సింగ్ అన్నారు. ఐలూ జిల్లా నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులు క్షమాభిక్ష కోరమని అడిగితే క్షమాబిక్ష కోరటం పిరికి వాడి చర్య అని తిరస్కరించిన ధీశాలి అన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు, ఆవేశం ఎంతో మంది స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కీర్తి మాట్లాడుతూ నేటి పాలకులు కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. పేదవారు మరింత పేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లం రాంబాబు, కైలే ఏసుదాసు, ఎస్. సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు, నాగరాజు, తాతబ్బాయి, బ్రహ్మచారి పాల్గొన్నారు.

భారాలు తప్పవా..?

కేటాయింపులే నిలుపుదల చేశారు. యుపిహెచ్‌సి నిధుల ఆదాయాల రూపంలో జీరో (0) చూపించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, వక్స్ గ్రాట్స్ తదితర పలు పద్దులకు నిధులు ఒక్క రూపాయి కూడా రావని తేల్చేశారు. వీటికి సంబంధించి ఆదాయాలు లేనప్పుడు ఖర్చులు కూడా లేవని పాలకపక్షం చెప్పకనే చెప్తుంది. ఎంతో ప్రాముఖ్యత కల్గిన వాటికి కూడా నిధులు కేటాయింపు అరకొరగానే చేశారని విమర్శలు వస్తున్నాయి. 50 వేల కుటుంబాలకు పైగా నివాసాలుంటున్న కొండ ప్రాంతాల అభివృద్ధికి నామమాత్రంగానే నిధులు కేటాయింపులు జరిగాయి. కేవలం రూ. 9 కోట్లు మాత్రమే చేయడం పట్ల బడ్జెట్ సమావేశంలో కొండ ప్రాంతాల కార్పొరేటర్లు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ అధికారపక్షాన్ని నిలదీశారు. నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.అలాగే ఎంతో ముఖ్యమైన బ్రిడ్జీలు, ఫ్లైఓవర్లు, సబ్‌వేల నిర్వహణ, బరియల్ గ్రౌండ్స్ , మందుల కొనుగోలు, ఆస్పుత్రుల నిర్వహణ తదితర వాటికి కూడా నామమాత్రంగానే నిధులు కేటాయింపులు చేశారనే విమర్శలు వచ్చాయి. ఇవి ఇలా ఉంటే దుబారా ఖర్చులు కూడా పెరుగుతున్నాయనే చర్చ కూడా లేకపోలేదు. ఇంజినీరింగ్ అధికారులుండగా, ఇంజినీరింగ్ వర్క్స్ అంచనాలు, డిపిఆర్ తయారీకి ప్రయివేటు కన్సెల్టెన్సీలకు కోట్ల రూపాయలు ఫీజుల రూపంలో వృధాఖర్చు చేస్తున్నారని వీటిని తగ్గించుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేసిన దానిని బట్టి విఎంసి సొమ్ము మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తున్నారని చెప్పక తప్పదు. ఏది ఏమైనా రానున్న ఏడాదిలో నగర ప్రజలపై భారాలు తప్పవనే సంకేతాలు బడ్జెట్ ద్వారా అధికార పక్షం, కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు చెప్పకనే చెప్తున్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి ఉద్యమిస్తామంటూ సిపిఎం, ఇతర వామపక్షాలు హెచ్చరిస్తున్నాయి.



భగత్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-విజయవాడ: భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ ఆయనకు ఘన నివాళి అర్పించింది. భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత సాధించాల్సిన అవసరం ఉందని, ఆయన త్యాగం నిరూపుమానమైనదని బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి రాజా కొనియాడారు. భగత్ సింగ్ ప్రాణత్యాగం ఆనాటి దేశ యువతలో కాంక్షను రగిలించి స్వాతంత్ర పోరాటంలో యువత భాగస్వామ్యాలు అయ్యేటట్లు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆవుల వెంకట్రావు, లంక రామ్మోహన్రావు, కోటబాబు, బిలాల్ ఎక్స్ ఎడిషనల్ పిపి వై.పుల్లారెడ్డి, బెజవాడ బార్ అసోసియేషన్ మేనేజర్ టి.వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం వాసవి క్లబ్ కృషి చేస్తోందని అన్నారు. రోగులను పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా క్లబ్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో హోమియో వైద్యులు మణికంఠ రోగులకు పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు క్లబ్ ఆధ్వర్యంలో ఉచితముగా అందచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు దింటకుర్తి జ్యోతి, అన్నం సత్యవాణి, జూపూడి కిరణ్, ఉరిమి సువర్చల పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇన్నర్వోలీక్లబ్ ముందంజలో ఉంటుందని క్లబ్ అధ్యక్షురా లు న(ర్రా సుధారాణి అన్నారు. క్లబ్ సభ్యురాలు బొరుకాటి శ్యామల సహకారంతో గుర జాడ డొంకలో నివసిస్తున్న పేదలకు దుస్తులు, అల్పాహారం ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిత్తుకాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్న గిరిజన కు టుంబాల వారికి తోచిన విధంగా సాయం అందించాలన్న ఉద్దేశంతో శ్యామల ఆధ్వర్యం లో దుస్తులు, అల్పాహారం అందిచడం ఎంతో సంతోష కరంగా ఉందన్నారు. సభ్యుల సహకారంతో క్లబ్ పలు సేవా కార్యక్రమాలు చేసిందని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయలన్నది లక్ష్యమన్నారు.



చెక్కులతో లబ్ధిదారులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలోని 60 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ 53 లక్షల 95 వేల 152 ల చెక్కులను ఎంఎల్ఏ బుద్ధప్రసాద్ ఆదివారం అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు నియోజకవర్గంలో 176 మంది లబ్దిదారులకు రూ కోటి 46 లక్షల 83 వేల 388 లను అందజేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్‌పి



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అమాయకుల అలవాట్లను ఆసరాగా చేసుకుని ఎవరైనా డబ్బు ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడినా, నిర్వహించినా ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని , వారిపై చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడమే కాక కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు హెచ్చరించారు. ఐపీఎల్, టి20 క్రికెట్ మ్యాచ్లను ఆసరాగా తీసుకొని, అమాయక ప్రజలను, యువకులను టార్గెట్ గా చేసుకొని ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చనే ఆశలు రేకెత్తించే లా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ ఎంతోమంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్న క్రికెట్ బెట్టింగ్ లను కూకటివేళ్లతో పెకలించడానికి కృష్ణాజిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల బెట్టింగ్ యాప్స్ వలన చాలామంది ఈజీ మనీకి అలవాటు పడి పెట్టుబడి పెడుతూ చివరికి అప్పుల ఊబిలో కూరుగిపోతూ ఆర్థికంగా నాశనం నాశనం అవ్వడమే కాక తీవ్ర మానసిక వత్తిడిలోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కనుక ఎవరూ కూడా కష్టపడకుండా వచ్చే నగదుకు ఆశపడి బెట్టింగ్ రాయుళ్ల చేతుల్లో చిక్కుకోవద్దని, మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.అవసరం మేరకు సస్పెక్ట్ సీట్లు ఓపెన్ చేస్తామన్నారు. ఊరికే వచ్చే నగదు వెనుక అనేక నష్టాలు దాగి ఉన్నాయని యువత గుర్తు ఎరగాలని, అనవసర ఆర్భాటాలకు పోయి తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేయవద్దని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. పెన్షన్లు,ఇతర ఆర్థికపరమైన సమస్యలను త్వరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ప్రజలకు ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముందు గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వర్తక, వాణిజ్య వ్యాపారుల సంఘ నాయకులతో ఎమ్మెల్యే రాము సమావేశం అయ్యారు. పర్యావరణ పరిరక్షణలో వ్యాపారులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ సారధి, తాసిల్దార్ బి లోకరాజు, మండల టిడిపి అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పవతి, పంచాయతీ కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావు మండల టిడిపి నాయకులు వల్లభనేని వెంకట్రావు, పొట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎంఎల్ఎ వెనిగండ్ల రాము

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి-గన్నవరం : తూర్పుగోదావరి జిల్లా దూబచర్లలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు మాలవేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గన్నవరంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అంబేద్కర్ ని అవమానించడం సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు



మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలని ధర్నా


పెనమలూరు : మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని ఐద్వా ఆధ్వర్యంలో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకిలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు, కృష్ణాజిల్లా వీరవనేనిగూడెంలో జరిగిన మహిళలపై అత్యాచారానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు మండల ఐద్వా కార్యదర్శి పుసులూరి పాతాళలక్ష్మి, ఐద్వా సంఘం నాయకురాలు సిహెచ్ భవాని, ఉప్పాడ ఈశ్వరి, చిప్పా లక్ష్మి, దుర్గ, వరలక్ష్మి, ఎం రమ, దివ్య, సిపిఎం నాయకులు నాయకులు త్రిమూర్తులు, లక్ష్మీనారాయణ, సోమశేఖర్, సత్యనారాయణ, దుర్గారావు, రాంబాబు, కిరణ్, మనోజ్, ప్రకాష్ రాజ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వీరాస్వామికి నివాళులర్పిస్తున్న నాయకులు

నందం వీరాస్వామికి నివాళి

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం కాజ గ్రామంలో సీనియర్ సభ్యులు నందం వీరాస్వామి అనారోగ్యంతో మార్చి 11వ తేదీన మృతిచెందారు. సిపిఎం మొవ్వ మండల, కాజ శాఖ ఆధ్వర్యంలో నందం వీరాస్వామి సంస్మరణ సభ ఆదివారం కాజ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు, మండల కమిటీ సభ్యులు ఉప్పలపు వెంకటాద్రి, కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు, బొల్లా సుబ్ర మణ్యేశ్వరావు, సీనియర్ సభ్యులు కామ్రేడ్ రావులపల్లి మురహరి, బత్తిన రామచంద్రరావు, కర్ర నందీశ్వరరావు, కొడాలి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



బుద్ధప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్‌కు జనసేన నాయకులు అభినందించి సత్కరించారు. ఆదివారం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, అవనిగడ్డ పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు ఆళ్ళమళ్ళ చందు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి ఏసుబాబు, సీనియర్ నాయకులు మతి సుబ్రహ్మణ్యం బుద్ధ ప్రసాద్‌ను ఆయన స్వగృహంలో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్, లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, ఐజిఎంఐ నిర్వాహకులు ఇమ్మానుయేల్ మోజెస్ బుద్ధ ప్రసాద్ ను కలిసి ఆయన సత్కరించి అభినందనలు తెలిపారు.





నిర్మానుష్యంగా ఉన్న రహదారులు

ఎండలతో అల్లాడుతున్న జనాలు

- ఉదయం 9 గంటల నుంచే భగభగ
- శీతల పానీయాలకు డిమాండ్

ప్రజాశక్తి-గన్నవరం : మే నెల రాకముందే పెరుగుతున్న ఉష్ణోగ్రత తీవ్రతకు జనాలు అల్లాడిపో తున్నారు. జాతీయ రహదారి నిప్పుల కొలిమిలా మారుతోంది. రోడ్డు మీదనడుస్తుంటే మంటలు పుట్టే శగలు వస్తు న్నాయి. దీంతో ప్రయాణికులు బేజారెత్తిపోతున్నారు. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు పెరిగింది. దీంతో వడ గాలుల తీవ్రత అధికంగా ఉంటుంది. వద్దులుబయటకు రావాలంటే భయ పడుతున్నారు. ఇప్పుడే ఇలాగుంటే మే నెలలో ఎలాగుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. 12 గంటలు అయ్యే సరికి ఎండ పెరిగి వడగాలులు వీస్తున్నాయి. పనులున్నా సాయంత్రం 5 గంటల తర్వాతనే చేస్తున్నారు. గన్నవరం నుంచి వెళ్తున్న జాతీయ రహదారిపై మధ్యాహ్నం 1 గంట తర్వాత పెద్దగా జనాల సంచారం కనిపించడం లేదు. వాహనాలు పెద్దగా వెళ్లడం లేదు. రోడ్డు పక్కన చెట్టు కింద వాహనాలు ఆపుకుని డ్రైవర్లు సేద తీరుతున్నారు. గన్న వరం- ఆగిరపల్లి రోడ్డు, పురుషోత్తపట్నం-ముస్తాబాదరోడ్డు, కేసరపల్లి- సావరగూడెం రోడ్డు, తెంపల్లి రోడ్లలో జనాల సంచారం కనిపించడం లేదు. గ్రామాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వద్దులు చెబుతున్నారు.

చిరు వ్యాపారులకు ఇక్కట్లు : ఎండలు అధికంగా జనాలు బయటకు రాకపోవడంతో వ్యాపారాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బదులు పడుతున్నారు. పట్టణంలో రోడ్ల వెంట రోజువారీ వ్యాపారాలు చేసుకునేవారు సుమారు 210 మంది ఉన్నారు. మామిడి కాయలు, కొబ్బరి బొండాలు, పండ్లు, కూరగాయలు విక్రయిస్తుంటారు. ఉదయం 11 గంటల తర్వాత వడగాలుల పాలిట పడుతున్నారు. జనాలు బయటకు రాకపోవడంతో వ్యాపారం ఉండటం లేదని అంటున్నారు. జీవనోపాధికి తప్పని పరిస్థితుల్లో ఎండలోనే ఉంటున్నామని, రోజంతా కూర్చునా ఉపయోగం ఉండటం లేదని వాపోతున్నారు.

శీతల పానీయాలకు డిమాండ్ : ఎండల తీవ్రత వల్ల శీతల పానీయాలకు గిరాకీ ఏర్పడింది. కూల్ డ్రింక్స్ షాపులు వద్ద కిటకిటలాడుతున్నారు. ఫ్రూట్ జ్యూస్ షాపులు ఖాళీగా ఉండటం లేదు. గ్లాసు ఒకటి రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. కొబ్బరి బొండాలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఎండల తీవ్రతలు తట్టుకోలేక తరలు పెరిగిన జనం కొబ్బరి నీళ్ళు తాగి సేద్ద తీరుతున్నారు.




చిరువ్యాపారుల కష్టాలు



పుష్ప యాగం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామికి పుష్పయాగం అత్యంత కన్నుల పండుగ నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో విజయవాడ ఏ కన్వెన్షన్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన ఉదయాస్తమాన సేవలు అత్యంత వైభవంగా ముగిశాయి. సాక్షాత్తు తిరుమలలో జరిగేలా శ్రీవారి సేవలను నిర్వహించారు. ఏ కన్వెక్షన్ ప్రాంగణాన్ని శ్రీవారి ఆలయాన్ని తలపించేలా తీర్చిదిద్దారు. ఉదయాస్తమాన సేవల్లో భాగంగా రెండో రోజున ఆదివారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ కొలువు తోమాల సేవ సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 10 గంటలకు తిరుప్పా వడ సేవ, శ్రీవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు శ్రీవారి పుష్ప యాగం సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మిడ్ టౌన్ విజయవాడ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, చైర్మన్ శ్రీనివాస్ బాలాజీ, కన్వీనర్ యడ్ల పార్థసారథి, క్లబ్ సెక్రటరీ బి సుందర్ రెడ్డి మాట్లాడుతూ తిరుమలలో జరిగే విధంగా ఉదయాస్తమాన సేవలు నిర్వహించినట్లు తెలిపారు. తిరుమల ప్రసాదాన్ని కూడా అందించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాసుల బ్రహ్మం, సంపత్, వనమా గణేష్, చారు గుండ్ల రమేష్, నంబూరు జీవన్, నూలు కృష్ణారావు, తొండేపు ఉదయ్, గుర్రం రంజిత్, కొల్లిపర రాజేష్ పాల్గొన్నారు.



పారిశుధ్య నిర్వహణ పరిశీలన

ప్రజాశక్తి - నందిగామ : పాత బస్టాండ్లో చెత్త పేరుకుపోయి, డ్రైనేజీతో ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని తెలుసుకొన్న నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఆదివారం పరిశీలించారు. కమిషనర్ దగ్గరుండి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇవి రమణబాబు మాట్లాడుతూ విచ్చలవిడిగా చెత్తాచెదారాలు ఎక్కడబడితే అక్కడ వేయకుండా కాలువల్లో చెత్త పేరుకుపోతుందని, దాని వల్ల ప్రజలే ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. వీధుల్లో పరిశుభ్రత వాతావరణం నెలకొనేలా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ సిబ్బందికి పారిశుధ్య కార్మికులకు ఉంటుందని తెలిపారు. ప్రజలు కూడా పారిశుధ్య విషయమై ప్రత్యేక శ్రద్ధతో మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉద్దేశంతో సహకరించాలని కోరారు. ప్రజలలో సంపూర్ణ పారిశుధ్యం పట్ల మరింత అవగాహన పెంచాలని తెలిపారు. కమిషనర్ రమణరావు ఆదివారం సెలవు, పైగా ఆయన పుట్టినరోజు అయినప్పటికీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు కట్ చేసి కమిషనర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో జెఆర్‌సి కళాశాల ఆవరణలో ఆదివారం శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ విజయవాడ వారి సహకారంతో జేఆర్‌సి విద్యాసంస్థల వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ నేటి సమాజానికి వాసవి క్లబ్ లాంటి సంస్థలు ఎంతో అవసరమని ప్రజలు ఇటువంటి వైద్య సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, కౌన్సిలర్స్ కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వర రావు, వాసవి క్లబ్ సభ్యులు, వైద్యులు, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, దాని ప్రకారం వేతనాలు పెంచాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల ఎన్టీఆర్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం విజయవాడ రాణిగారితోటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో పి.జ్యోతి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ధనలక్ష్మి మాట్లాడుతూ పేద ప్రజలకు కోవిడ్ సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసి ప్రపంచ ఆరోగ్య సంస్థతో ప్రశంసలు అందుకున్న ఆశ వర్కర్లకు నేటికీ కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచలేదని, వెంటనే ఎన్‌హెచ్‌యంకు అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు, పసిపిల్లలకు, గర్భిణులు, బాలింతలకు నిరంతరం ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్స్‌ను కేంద్ర ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు లేకపోవడంతో ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో చాలీచాలని జీతాలతో ఆశ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ ఏర్పడి 20 సంవత్సరాలు అయినప్పటికీ కనీస వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన మెటర్నటీ లీవులు, 62 సంవత్సరాల వయోపరిమితి పెంపుతో పాటు సర్వీస్‌ని బట్టి గ్రాట్యుటీ చెల్లిస్తామని ప్రకటించిన వాటికి వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో యూనియన్‌తో చర్చలు జరిగిన సందర్భంగా ఇచ్చిన రాతపూర్వక హామీల్లో సాధారణ సెలవులు, మెడికల్ లీవులు, బీమా సౌకర్యం వంటి వాటిని అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 'క్యూబాకు సంఘీభావం తెలుపుదాం అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం' అని కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కమల, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి శ్రీలక్ష్మి, జిల్లా నాయకులు సంగీతం జ్యోత్స్న, భీమాల లక్ష్మి, తిరుమలేశ్వరి, కమల, రాణి, బేబీ రాణి, వజ్రమ్మ, దయామణి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న ధనలక్ష్మి, జ్యోతి, ఎన్‌సిహెచ్, తదితరులు

డిస్నీలాండ్ స్థలాన్ని పేదలకు కేటాయించాలి: సిఐటియు

ప్రజాశక్తి - విజయవాడ : డిస్నీల్యాండ్ స్థలంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వర్గసభ్యులు కె.దుర్గారావు అన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే చలో కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సింగ్‌నగర్ 60, 63 డివిజన్లలో పేదల నుంచి దరఖాస్తులు రాయిస్తూ ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ పేదల నుంచి దరఖాస్తులు పూర్తి చేయిస్తూ నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్నుద్దేశించి దుర్గారావు మాట్లాడుతూ... టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టిడ్కో ఇళ్లు ఇస్తామని చెప్పి, ఎనిమిది మాసాలు దాటినా నేటికీ అతిగతీలేకుండా పోయిందన్నారు. వేలాది టిడ్కో గృహాలు నిర్మాణాలు పూర్తి చేసుకొని వాటి కేటాయింపులు జరగలేదని, గృహాలన్నీ దెబ్బతింటున్నాయని అన్నారు. 2 సెంట్లు స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇస్తామని ఎన్నికల వాగ్దానం ప్రకారం తక్షణమే డిస్నీల్యాండ్ స్థలాన్ని, రైల్వే స్థలం, సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ స్థలాన్ని పేదల ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె పీరు సాహెబ్, డి.కనకదుర్గ, పి.సాంబిరెడ్డి, ఎల్.నిర్మల, ఎస్‌కె రఫీ, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా స్థానికులతో మాట్లాడుతున్న దుర్గారావు

టిడ్కో ఇళ్లను పంపిణీ చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి - విజయవాడ : నిర్మించి ఖాళీగా ఉన్న టిడ్కో ఇళ్లను వెంటనే సదరు లబ్దిదారులకు కేటాయించాలని సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు కోరారు. కృష్ణలంక 22వ డివిజన్‌లో ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన కోసం ఈ నెల 28న నిర్వహించే చలో కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పేదల వద్ద నుంచి దరఖాస్తుల పూర్తి చేయించే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఇళ్ల సాధన కోసం నిర్వహించే ఛలో కలెక్టరేట్ కార్యక్రమంలో పేదలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది మాసాలు అవుతున్నా నిర్మించి, ఖాళీగా ఉన్న వేలాది గృహాలను పంపిణీ చేయడం లేదని అన్నారు. వెంటనే సింగ్‌నగర్, వాంబేకాలనీ, జక్కంపూడి తదితర ప్రాంతాల్లో పేదల కోసం నిర్మించిన ఇళ్లను వెంటనే కేటాయించాలని కోరారు. నాయకులు కాయల లక్ష్మణరావు, వాజ శ్రీనివాసరావు, తూబాటి తాండవ కృష్ణ, కొమ్మూరి ఆనంద్, పి.కొండ తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులు పూర్తి చేయిస్తున్న నాయకులు

ఎర్ర కాలువ వేపల వాగు పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఎర్రకాలువ వేపల వాగును ప్రక్షాళన చేయాలని పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ అన్నారు. ఆదివారం వేపల వాగును పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ వట్టేం మనోహర్ ఆధ్వర్యంలో జనసేన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కోటి రూపాయలు నిధులతో బురద, చెత్త, ప్లాస్టిక్ వ్యర్ధాలను తొలగించాలని డిమాండ్ చేశారు. వేపల వాగులో ప్లాస్టిక్ వ్యర్థాలు, బురద, బుర్రపుడెక్క, చెత్తాచెదారం పెరిగిపోయి పారుదల లేక దాని పక్కనే ఆనుకొని నివసిస్తున్న ప్రజలకు దుర్వాసన, విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, బోదకాలు వంటి వ్యాధులు వచ్చి ఇబ్బంది పడుతున్నారని కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల నుండి ఒక రూపాయి కూడా వేపలవాకుకు, ఎర్రకాలువకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. గతంలో వైసిపి ప్రభుత్వంలో ఎర్ర కాలువ వేపల వాగు ప్రక్షాళనకు ఇరిగేషన్ శాఖ ద్వారా గుర్రపు డెక్క తొలగింపు, కాలువలు శుభ్రం చేసేందుకు సుమారు రూ.55 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణ మాజీ పార్టీ అధ్యక్షులు చౌడవరపు జగదీష్, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు లాహోరి బద్దు నాయక్, జగ్గయ్యపేట ట్రేడ్ యూనియన్ నాయకులు గంగోలు, వినోద్, జగ్గయ్యపేట ప్రచార కమిటీ అధ్యక్షులు గోగుల వెంకయ్య, పట్టణ వైసిపి నాయకులు దార్ల ప్రసన్న, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





శ్రీనివాసరావును అభినందిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ ఒబిసి జిల్లా సెల్ చైర్మన్‌కు అభినందన

ప్రజాశక్తి - తిరువూరు : కాంగ్రెస్ ఒబిసి జిల్లా సెల్ చైర్మన్‌గా నూత నంగా నియమి తులైన నల్ల మోలు శ్రీనివాస రావుకు ఆ పార్టీ నాయ కులు తిరువూరులో ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక రాజీ భవనంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌కి తిరువూరు నియోజకవర్గంలో పునర్వైభవం తీసుకురావ డానికి తన వంతు కృషి చేస్తానని విలేకరులకు తెలిపారు. ఒబిసి సెల్ చైర్మన్ గా భవిష్యత్తులో మంచి కార్యక్రమాలు తీసుకుని ప్రజల మన్నన లు పొంది పార్టీని బలోపేతం చేయాలని, బాధ్యతగా మెలగాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పల్లేపాటి శ్రీనివాసరావు ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు ప్రకాశరావు, ఉప్పలపాటి లక్ష్మీదాస్, జీవన్ బాబు, తమ్మారపు ఆదినారాయణ, ఎం.లక్ష్మణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతూ వారి సమస్యలడిగి తెలుసుకుంటున్న దృశ్యం

నందిగామ సబ్ జైలు తనిఖీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ సబ్ జైలును ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రిన్సిపుల్ డిస్టిక్ జడ్జ్, కృష్ణాజిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ అరుణ సారిక, కృష్ణాజిల్లా సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.వి.కృష్ణయ్య ఆదివారం తనిఖీ చేశారు. సబ్‌జైల్లో ఖైదీలను పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు ఏ కేసుల్లో వచ్చారు, ఎప్పటి నుంచి ఉంటున్నారు పలు విషయాలను కూలంకుషంగా తెలుసు కున్నారు. జైలు నుండి విడుదల అయినా తర్వాత అందరూ సత్ప్రవర్తంతో మెలగాలని, సమాజం కోసం పాటుపడాలని కోరారు. పరిసర ప్రాంతాలను స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నందిగామ సీనియర్ సివిల్ జడ్జి నాగలక్ష్మి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ అద్దంకి మణిబాబు. వివిధ కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సబ్ జైలులో జిల్లా జడ్జి సబ్ జైల్ సిబ్బంది గౌరవ వందనాన్ని సమర్పించారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పేదలను అన్ని రకాలుగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. మండలంలో 47 మంది లబ్ధిదారులకు 19 లక్షల, 87 వేల రూపాయలు, 600 రూపాయలు ఎంఆర్‌ఎఫ్ చెక్కులు మండలంలోని వివిధ గ్రామాల్లో లబ్ధిదారుని ఇళ్ల వద్దకు వెళ్లి వారికి పంపిణీ చేశారు. నియోజకవర్గంలో వైద్యం చేయించుకున్న బిల్లులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య దృష్టికి తీసుకొని రాగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సహాయ నిధి నుంచి మంజూరు చేయించి బాధితులకు చెక్కులు అందజేశారు.

మెడికల్ షాపుల మాయాజాలం..

● అడ్డగోలుగా ఔషధ వ్యాపారం ● షాపుల్లో బినామీల దందా



ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం నియోజకవర్గంలో మెడికల్ షాపు నిర్వాహకుల మాయాజాలంతో రోగులు తీవ్రంగా నష్టపోతున్నారనే విమర్శలున్నాయి. మెడికల్ షాపు చిన్నదైనా పెద్దదైనా అందులో ఫార్మాసిస్ట్ ఉండాలి. మందులు ఎలా వేసుకోవాలో రోగికి విడమర్చి చెప్పాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలి. రోగి శారీరక, మానసిక పరిస్థితిని బట్టే అవసరమైన మందులు ఇవ్వాలి. ఇలా మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధలను పాటించాలి. కానీ నియోజకవర్గం నాలుగు మండలాల్లో మందుల దుకాణాల వ్యాపారం కిరాణ షాపుల్లా మారింది. డాక్టర్ రాసిచ్చే చీటీతో సంబంధం లేకుండా ఎవరడిగినా మందులు ఇచ్చేస్తున్నారు. డి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు.. మెడికల్ షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మీకు తల నొప్పి నొస్తోందా..? జ్వరం వస్తోందా? కడుపు నొప్పి.. ఒళ్లు నొప్పులతో భరించలేకుండా ఉన్నారా? నిద్ర పట్టడం లేదా? ఏం భయం లేదు. అనారోగ్య సమస్యలపై డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే లేదు. గన్నవరం,బాపులపాడు, ఉంగుటూరు విజయవాడ రూరల్ ఈనాలుగు మండలాల్లో డాక్టర్ రాసిచ్చే చిట్టీతో సంబంధం లేకుండా ఎవరడిగినా మందులు ఇచ్చేస్తున్నారు. డి-ఫార్మసీ/ఎం-ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు.. మెడికల్ షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అల్లోపతి మెడిసిన్ విచ్చలవిడి అమ్మకాలపై ఔషధ నియంత్ర అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.

ఎక్స్‌పైర్డ్ మందులూ అమ్ముతున్నారు?

డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులను అంటగడుతున్నారు. ఏమన్నా అంటే.. 'సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు. ఇది కూడా దానిలాగే పనిచేస్తుంది.' అని చెబుతున్నారు. రోజూ ప్రతి చిన్న, పెద్ద దుకాణాల్లో రూ.3వేల నుంచి రూ.లక్ష వ్యాపారం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో పనిచేసే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల అడ్రెస్సే లేదు. వారు ఎక్కడ ఉంటారో.. ఏ ప్రాంతంలో తనిఖీలు చేస్తున్నారో ఎవరికీ తెలియదు. అనేక షాపుల్లో కాలం చెల్లిన మందులు యథేచ్ఛగా అమ్ముతున్నారు. అర్హత, అనుభవం లేని వ్యక్తులు ఫార్మసిస్ట్ సర్టిఫికెట్లతో మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇష్టానుసారం మెడికల్ షాపులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు.

లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది....

గన్నవరం నియోజకవర్గంలో మందుల షాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితో మాత్రమే దుకాణాలను నిర్వహించాలి. చాలా మంది తక్కువ వేతనంతో యువకులకు పనిలో పెట్టుకుంటున్నారు. మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఏడీలు మెడికల్ షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకొని నిబంధనలకు పాతరేస్తున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో ఒప్పందాలు చేసుకొని మందుల దుకాణాలు నిర్వహిస్తున్నారు

మామూళ్ల మత్తులో.....

డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం ప్రతీ మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫార్మసిస్టు ఉండాలి. బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ ఇలా ఏదో ఒక ఫార్మసీ కోర్సు చేసిన వారు మాత్రమే మెడికల్ షాపు నిర్వహించాలి. మెడికల్ షాపులకు అనుమతిచ్చే సమయంలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఫార్మాసిస్టు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయాలి. ఏరియా ఇన్‌స్పెక్టర్లు ఈ బాధ్యత నిర్వర్తించాలి. కానీ కొందరు ఏరియా ఇన్‌స్పెక్టర్లు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

పర్సంటేజీలు మాట్లాడుకొని...

జనరిక్, నాన్ జనరిక్ అనే తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా డ్రగ్ కంట్రోల్ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని మెడికల్ షాపులు, కెమిస్ట్ డ్రగిస్ట్ ఏజెన్సీలపై దష్టిసారించి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఈనెల 31లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం కార్పొరేషన్, మండల పరిధిలోని 20268 మంది రేషన్ కార్డుదారుల ఈకేవైసీ పెండింగ్లో ఉందని వెంటనే వారు వారి రేషన్ డీలరు వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని మచిలీపట్నం నార్త్ తాహసీల్దారు నాగభూషణం, ,మచిలీపట్నం సౌత్ తహసీల్దార్ మధుసూ దనరావు లు ఆదివారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల కమీషనర్ వారు ఆదేశించారన్నారు. **ప్రజాశక్తి-గూడూరు :** గూడూరు మండల పరిధిలోని 4100 మంది రేషన్ కార్డుదారుల ఈకేవైసీ పెండింగ్లో ఉందని వెంటనే వారు వారి రేషన్ డీలరు వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని తాహసీల్దారు డి.రాజ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల కమీషనర్ వారు ఆదేశించారన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకునే సమయం ఈ నెల 25 తేదీ వరకు పొడగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు కె. శంఖ రావు తెలిపారు.కాబట్టి జిల్లాలో బిసి, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ మరియు కాపు (ఓసీ-కాపు, బలిజ, తెలగ, ఒంటరి) మేదరి, కుమ్మరి / శాలివాహన కులములకు)చెందిన వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2024-25 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బి.సి. కార్పోరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ మరియు కాపు కార్పోరేషన్లకు సంబంధించిన లబ్దిదారులకు బిసి కార్పోరేషన్, కష్టం వారి ద్వారా వివిధ పథకముల ద్వారా సబ్సిడీ మంజూరు చేయుటకు గాను, దరఖాస్తుదారులు ఏపీ ఓ బి ఎం ఎం ఎస్ ద్వారా వారి పేరును ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలన్నారు.



కొండలమ్మ దేవస్థానంలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా కొండలమ్మ అమ్మ వారిని సుమారు 18 వేల మంది పైగా యాత్రికులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి, వారి మొక్కు బడులు తీర్చుకున్నారు. అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే ఆలయం వద్ద ఏ విధమైన అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ, సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

నేడు 'మీకోసం'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక-మీకోసం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు.

కొత్త కోర్టు భవనం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి అరుణ సాగరిక, డిస్ట్రిక్ట్ అథారిటీ లీగల్ సెల్ చైర్మన్ కె.వి రామకష్ణయ్య గన్నవరం సబ్ జైలు ను ఆదివారం పరిశీలించారు. . ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని ఖైదీలను అడిగారు. అన్ని బాగానే ఉన్నాయని వారు జవాబు ఇవ్వటంతో సంతప్తి వ్యక్తం చేశారు. సత్ప్రవర్తన కలిగి జైలు నుంచి మారిన మనుషులుగా సమాజంలోకి వెళ్లాలని ఖైదీలకు ఆమె సూచించారు. అనంతరం గన్నవరం బార్ అసోసి యేషన్ కార్యవర్గం, న్యాయవాదులు జిల్లా జడ్జిని కలిసి కొత్త కోర్టు భవనం ఏర్పాటు చేయాలని, సబ్ కోర్టు దూరంగా ఉండటం వల్ల న్యాయవాదులతో పాటు కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని దానిని పట్టణంలోకి మార్పు చేయాలని విన్నవించారు. దానికి ఆమె సానుకూలంగా స్పందించారు. తర్వాత న్యాయ వాదులు జిల్లా జడ్జిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి రవి, వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి విమల్, న్యాయవాదులు సోమేశ్వరరావు, మూర్తి, రమేష్, శారదా తదితరులు పాల్గొన్నారు.



జడ్జి అరుణ సాగరికను సన్మానిస్తున్న దృశ్యం



పరీక్షా సామాగ్రి అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : పేద విద్యార్థులు ప్రతిభతో ఎదగాలని ఇండియా విలేజ్ మినిస్టర్స్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. మండల పరిధిలోని పురిటిగడ్డ ఐవీఎం హోంలో డాక్టర్ సురేష్ - రోజా దంపతులు తమ ఆర్థిక సహకారంతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుకుంటున్న వివిధ గ్రామాలకు చెందిన 280 మంది విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్ అందచేశారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేములపల్లి స్విటిన్ రాస్, వేములపల్లి సోఫి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో భాగస్వాములు కావాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో కూటమినేతలు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. చీపురు పట్టుకొని స్వయంగా రోడ్లు ఊడ్చిన పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎమ్మెల్యే రాముతో పాటు కూటమి నాయకులు, అధికారులు, గ్రామస్తులు ఉత్సాహంగా పరిసరాలను శుభ్రం చేయడంలో భాగస్వామ్యం అయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళుతూ తడి చెత్త - పొడి చెత్త నిల్వల డస్ట్ బిన్ లను ప్రజలకు ఎమ్మెల్యే రాము అందజేశారు. పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ సారధి, తాసిల్దార్ బి. లోకరాజు, గుడ్లవల్లేరు మండల టిడిపి అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, కార్యదర్శి ఎజేఎల్ నరసింహారావు, మండల టిడిపి నాయకులు వల్లభనేని వెంకట్రావు, పొట్లూరి రవి, పోలవరపు వెంకట్రావు, వల్లభనేని సుబ్బారావు, జంగం మోహన్ రావు, చాపరాల రాజా తదితరులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమానికి ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి- చల్లపల్లి : మండలంలోని పెదపాడుకు చెందిన ఇనగడప గంగాధరరావు సతీమణి రత్నకుమారి జ్ఞాపకార్థం చల్లపల్లి సెంటర్ లక్ష్మీ ఫ్యాన్సీ యజమాని వై. రవీంద్రనాథ్ లక్ష్మీ సహకారంతో స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ వృద్ధాశ్రమానికి రెండు సీలింగ్ ఫ్యాన్‌లను ఆశ్రమ నిర్వాహకులకు. ఆదివారం బహూకరించారు.



వాడవాడలా భగత్‌సింగ్ వర్ధంతి

భగత్ సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమాలు వాడవాడలా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి పలువురు నాయకులు ఆయన త్యాగాన్ని వివరించారు.

ప్రజాశక్తి - విజయవాడ : భగత్‌సింగ్ బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పలువురు న్యాయవాదులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిబిఎ ప్రెసిడెంట్ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ విప్లవ యోధుడు భగత్‌సింగ్‌ను ఈ నాటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆవుల వెంకట్రావు, లంక రామ్మోహన్‌రావు, నామాల ఎన్ కోట బాబు, బిలాల్ , ఎక్స్ ఎడిషనల్ పిపి వై పుల్లా రెడ్డి , బెజవాడ బెజవాడ బార్ అసోసియేషన్ మేనేజర్ టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కృష్ణలంక 22వ డివిజన్ డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ విప్లవ కిశోరాలు భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు దేశ స్వాతంత్ర పోరాటంలో ఉరికంబాలకెక్కారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు జె.కొండ, ఈ అంజిబాబు, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, ఎస్కే రిజ్వా నాగూర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. **విజయవాడ :** సత్యనారాయణపురం 33వ వార్డులో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర డివైఎఫ్ అధ్యక్షులు జి.రామన్న భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేశారు శాస్త్రి గారు భగత్ సింగ్ గారు అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలఆర్పించి 23 ఏళ్ల వయసులోనే తన ప్రాణాన్ని పణంగా పెట్టిన ధీరుడు అని కులాలకు మతాలకు అతీతంగా స్వాతంత్రం కోసం పోరాడారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.ప్రవీణ్ డివైఎఫ్ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు శివ 33వ వార్డు సిపిఎం శాఖ కార్యదర్శి ఎం.మురళి, ఎం.సత్యన్న, ఆటో యూనియన్ సత్యనారాయణ పురం ప్రెసిడెంట్ సైదులు, మురారి పాల్గొన్నారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా మధురానగర్ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి డివైఎఫ్ఐ కార్యదర్శి వై.మురళి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంలో ఇందిరా కాలనీ డివైఎఫ్ఐ నాయకులు యుగంధర్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.మురళి మాట్లాడారు. **విస్సన్నపేట :** విస్సన్నపేట స్థానిక సుందరయ్య భవనంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం విస్సన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం పూలదండ వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సిపిఎం విస్సన్నపేట మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు ఎస్ఎఫ్ఐ నాయకులు రవితేజ రాము, శ్రీను నరసింహారావు సునీల్ **ఇబ్రహీంపట్నం :** స్వాతంత్ర సమరయోధులు విప్లవ వీరులు సర్దార్ భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా కొండపల్లి క్రాంతి హైస్కూల్లో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని కాంతి హైస్కూల్ యాజమాన్యం, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్తంగా నిర్వహించాయి. ముందుగా విద్యార్థులు కొండపల్లి పురవీధుల్లో దేశభక్తి నినాదాలు చేస్తూ మువ్వన్నెల జెండాలు చేతబూని ప్రదర్శన చేశారు. ఇందులో 32 మంది బాల కళాకారులు ఒక అద్భుతమైన నాటకాన్ని రూపకల్పన చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి హాజరైన రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ స్ఫూర్తితో విద్యార్థి, యువకులు సమాజ శ్రేయస్సుకు రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటు పోరాడాలన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తిని యువకుల్లో తక్కువ చేసి చూపించే విధానం సరైంది కాదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనకు పాలకులు నోరు మెదపడం లేదని స్వాతంత్ర ఉద్యమంలోనే భగత్‌సింగ్ యువతని ఉత్తేజితం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కొండపల్లికి చెందిన ప్రముఖ కవి అనిల్ డ్యాని మాట్లాడుతూ ఈ నాటకం ద్వారా పిల్లల్లో దేశభక్తిని పెంపొందించడానికి తల్లిదండ్రులు కూడా కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రముఖ కళ దర్శకులు కె.శాంతారావు మాట్లాడుతూ సాంస్కృతిక వేదికలు కళల ద్వారా విద్యార్థులకు స్వాతంత్ర పోరాట స్ఫూర్తి ఆవశ్యకతను తెలియ జేస్తున్నాయని, ముఖ్యంగా భగత్ సింగ్ యువకుడుగా స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. క్రాంతి విద్యాసంస్థల కరెస్పాండెంట్ అమ్మాజీ, నాగార్జున విద్యా సంస్థల అధినేత జోని కుమారి మాట్లాడారు. 32 మంది పిల్లలు అత్యద్భుత నటన అందరినీ ఆకట్టుకుంది, ఆలోచింపచేసింది. భగత్ సింగ్ మీద ఒక పాట అంటే భగత్ సింగ్ లాల్ సలాం యువశక్తికి నవశక్తికి సంకేతం భగత్ సింగ్ అని అంటూ పాడే పాట ఒకటి అత్యద్భుతంగా నడిచింది. **జగ్గయ్యపేట :** మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో షేక్ గౌస్ మియా చికెన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన భగత్ సింగ్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి ఎస్ నాగమణి ప్రారంభించారు. అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా కృష్ణ, రావెళ్ల శేషు, దంతాల నరేంద్ర, కె.వెంకటేశ్వరరావు, ఎస్.రామనాథం, బాలు, బడే తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో భగతసింగ్ వర్ధంతిని యువజన, విద్యార్థులు నిర్వహించారు. భగత్ సింగ్ చిత్ర పటానికి జన విజ్ఞానవేదిక జిల్లా నాయకులు ఎం.హరికృష్ణ పూలమాల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరతమాతను దాస్య శృంఖలాల నుండి విడిపించడం కోసం భగతసింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురులు తమ జీవితాన్ని తృణప్రాయంగా త్యజించారన్నారు. **నందిగామ :** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటంకు ప్రజా సంఘాల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.గోపాల్, ఎస్ఎఫ్ఐ నాయకులు గోపీనాయక్ మాట్లాడారు. ప్రజాసంఘాల నాయకులు వల్లూరు.రవిశేఖర్, మహిళా సంఘం నాయకులు బాజిద్ బి,జాన్ సైదా,నరసింహ, బ్రహ్మం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణలంక 22వ డివిజన్‌లో...


మధురానగర్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఇబ్రహీంపట్నంలో పలు ప్రదర్శనల ద్వారా నివాళులర్పిస్తున్న విద్యార్థులు



బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో....


నందిగామలో....

వ్యవసాయానికి ఉపాధి పనులు అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి - వత్సవాయి : వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలని అనిగండ్లపాడు గ్రామంలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో భాగంగా అధికారులకు గ్రామ రైతులు పలువురు కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన తనిఖీ గ్రామ సభలో రైతులు ఉపాధి హామీ పనులకు కూలీలు వెళ్లటం వల్ల వ్యవసాయ పనులు సాగటం లేదని తెలిపారు. గ్రామంలో జరిగిన పనులకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై పలు ఫిర్యాదులు రాగా మండల స్థాయిలో జరిగే ఆడిట్‌లో నిజాలు నిగ్గు తేలుస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

కానిస్టేబుల్ సత్యనారాయణకు సత్కారం



ప్రజాశక్తి - గంపలగూడెం: గత మూడు సంవత్సరాలుగా గంపలగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్.సత్యనారాయణ సమర్థవంతంగా విధులు నిర్వహించినట్లు గంపలగూడెం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల భాగంగా, విజయవాడ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లాకు చెందిన సత్యనారాయణ పలు ప్రదేశాల్లో పనిచేశారు. గంపలగూడెం మండలంలో పనిచేసి సుపరిచితుడైనారు. ఎఎస్ఐ రమేష్ బాబు, స్టేషన్ సిబ్బంది సత్కరించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడులో నందిగామ టిడిపి ఉపాధ్యక్షులు ఉమ్మినేని విక్రమ్ ఆధ్వర్యంలో డాక్టర్ కృష్ణ మోహన్ సౌజన్యంతో ఆయుష్ శాఖ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఆయుర్వేద వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కెవిఆర్ లేఖలు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ : ప్రజల సంస్కృతి, జీవన విధానాల మీద దాడి చేస్తూ పరిపాలన సాగించే ఏ ప్రభుత్వాలకైనా పుట్టగతులు ఉండవని,



యూరప్ జర్మనీ వంటి దేశాల్లో ముస్సోలిని, హిట్లర్ వంటి వాళ్ళే మట్టి కరిచిన చరిత్ర ఉందని ఉస్మానియా డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులు ఆచార్య కాశీం ఉద్ఘాటించారు. ప్రముఖ సాహితీవేత్త కెవి రమణారెడ్డి వర్ధంతి సందర్భంగా కెవిఆర్, శారదాంబ స్మారక కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ స్వర్ణ ప్యాలెస్ హోటల్‌లో సదస్సు నిర్వహించారు. తెలుత 'కెవిఆర్ లేఖలు' పుస్తకాన్ని విరసం నాయకులు చెంచయ్య ఆవిష్కరించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న కాశీం 'సంస్కృతి – భావజాలం కెవిఆర్ దృక్పథం' అంశంపై కీలకోపన్యాసం చేశారు. విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ అధ్యక్షత వహించిన సభలో కెవిఆర్ కుమార్తె డాక్టర్ వసుంధర, విరసం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదితో తెలుగు వెలుగులు నింపాలి : మండలి

ప్రజాశక్తి–విజయవాడ: ఉగాది నుండి ఆంధ్ర రాష్ట్ర మంతా తెలుగు భాష వెలుగులు నిండాలని, ఆంధ్ర రాష్ట్రం ప్రపంచానికి ప్రగతి గమ్యస్థానం కావాలని అందుకు ప్రతి తెలుగు వారు కృషి చేయాలని ఎంఎల్ఎ మండలి బుద్ధ ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఎంతో మంది సేవా తత్పరులను ఉగాది పురస్కారాలతో సత్కరించిన సేవ్



టెంపుల్స్ భారత్ చైర్మన్ డా. గజల్ శ్రీనివాస్ ను అభినందించాలని ఆయన అన్నారు. తొలుత రెడ్డప్ప ధవేజి ఆహుతులకు స్వాగతం పలికారు. సభకు డా. గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా ఎమ్.సి.దాస్, గోళ్ల నారాయణ రావు, చలసాని ఆంజనేయులు, గొట్టిపాటి రామకృష్ణ, వేముల హజరత్తయ్య గుప్తా, చలపాటి వెంకటేశ్వరరావు, దోగుపర్తి శంకర రావు, రసరాజు, జయంత్, నాగ మల్లేశ్వర రావు, కలిమి శ్రీ, మెడికొండ శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట కోర్టు ప్రాంగణం సందర్శన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సాధారణ తనిఖీల్లో భాగంగా జగ్గయ్యపేట కోర్టును కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికకు జగ్గయ్యపేట న్యాయమూర్తి ఎం.శోభారాణి పరిపాలన పరమైన విషయాలను తెలిపారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు దశాబ్దాల దశలో ఉన్న జగ్గయ్యపేటకు సబ్ కోర్ట్ మంజూరు విషయాన్ని, పెనుగంచిప్రోలు సివిల్ జూరిస్డిక్షన్ విషయమై నివేదికను త్వరగతిన హైకోర్టు వారికి అందజేయాలని కోరారు. న్యాయవాదులు బడే జోగింద్రకుమార్, బి.నరసింహారావు, రావూరి ప్రసాద్, శ్రీధర్, అప్పన మాధురి, ఎం.ప్రతిభ పాల్గొన్నారు.

సంతోషంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గంపలగూడెం : విద్యార్థుల నుండి పెద్దల వరకు సంతోషంగా ఉంటేనే ఆరోగ్యం ఉంటుందని స్థానిక కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ప్రపంచ సంతోష దినోత్సవాన్ని నిర్వహించారు. సందర్భంగా శ్రీనివాసరావు విద్యార్థులకు సంతోష దినోత్సవంపై వివరించారు. విద్యార్థులు కేరింతలు కొడుతూ, ఉత్సాహంగా విద్యార్థులు ఒక గంట పాటు ఆడుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామంలో ఊరు బయట మామిడి తోటలో రహస్యంగా పేకాట ఆడుతున్నారని విస్సన్నపేట ఎస్ఐ జి.రామ కృష్ణకు సమాచారం రావడంతో 9(1) శిబిరంపై దాడి చేసి 8 మంది వ్యక్తులను రూ.3,150ల నగదును స్వాధీనం చేసుకు న్నారు. వారిపై కేసు నమోదు చేశామని, చట్టానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు కొనసాగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నందిగామ : గొడవలకు వివాదాలకు దూరంగా ఉంటామని పాత నేరస్తులతో నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు ఆదివారం ప్రమాణం చేయించారు. నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడత కలిగి, వివిధ కేసుల్లో ఎదుటివారిని ఇబ్బందులకు గురి చేస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నందిగామ సిఐ మాట్లాడుతూ నందిగామ టౌన్, మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదని అటువంటి చర్యలు చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐ అభిమన్యు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నాయకుడు మృతికి నివాళి

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన జనసైనికుడు ఆదర్ష వంశీ శనివారం మృతిచెందడంతో మృతదేహాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త బాడిశ మురళీకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. అనుమంచిపల్లి గ్రామ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జయప్రద ఫౌండేషన్ ద్వారా గ్రామ పెద్దలతో, జనసేన నాయకులతో కలిసి వారి కుటుంబానికి చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రేగండ్ల వెంకట రామయ్య, ఉపాధ్యక్షుడు రామకోటేశ్వరరావు, పవన్, అనీల్, నాగుల్, శ్యామ్, జానీ నవీన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. వంశీ కృష్ణ మతదేహాన్ని జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుల సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భగత్‌సింగ్ జీవితం భావితరాలకు ఆదర్శం



కంకిపాడు మండలం ఉప్పులూరులో...

భగత్ సింగ్ 94వ వర్ధంతిని కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామంలో డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి డివైఎఫ్ఐ నాయకులు వి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవల స్ఫూర్తితో యువత మతోన్మాదానికి వ్యతిరేకంగా విద్యా ఉపాధి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకి పెరుగుతోందని నిరుద్యోగానికి పరిష్కారం భగత్ సింగ్ చెప్పిన సోషలిజమే మార్గమని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి యువతరాన్ని చీల్చుతుందని యువత ఐక్యతతో దేశ సమైక్యత కోసం మతసామరస్యం కోసం నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎం నాగరాజు, యు ఆంజనేయులు, డి బన్నీ, కే చిరంజీవి, టి అశోక్ ,డి చందు ప్రజా సంఘాల నాయకులు పంచకర్ల రంగారావు, టి నరేష్, ఎం చంటిబాబు, సిహెచ్ శ్రీహరి,కే నాంచారయ్య, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

అలాగే కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో భగత్ సింగ్ చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు టి నరేష్, వి మరియదాసు, వి శివశంకర్, వి సునీత పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అలాగే యనమలకుదురు గ్రామంలోని భగత్ సింగ్ నగర్ సెంటర్లో భగత్‌సింగ్ విగ్రహానికి ఎస్ఎఫ్ఐ నాయకులు పి.క్రాంతి, డివైఎఫ్ఐ నాయకులు షేక్ ఇబ్రహీం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండల జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం, ఎస్ఎఫ్ఐ నాయకులు తులసీరామ్, పవన్ కుమార్,అశోక్ ,హేమంత్ కుమార్ డివైఎఫ్ఐ నాయకులు మస్తాన్ మౌలాబి, నిఖిల్, ప్రజా సంఘాల నాయకులు బాబు, పాపారావు, శ్రీరాములు భగత్ సింగ్ నగర్ కమిటీ వాసులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు :** భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం లోని దళిత వాడలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యం లో భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం బావితరాలకు ఆధర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నూతల సర్పంచ్ టివి రామ్మోహన్ రావు, మండల పార్టీ నాయకులు మాగంటి సాంబ శివరావు, చౌటపల్లి ప్రభాకరరావు, సలీం, అబ్రహం, శేఖర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి చల్లపల్లి :** భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద నిర్వహించారు. ఆటో యూనియన్ సీనియర్ నాయకులు కూతాడ కోటేశ్వరరావు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, నంద్యాల ఓంకారం జంపాన శీను, ఎఫ్ శ్రీను, ఆర్ దాసు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమాన్ని గుడివాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంజనేయపేటలోని సుందరయ్య భవనంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవభారత్ ఖాది స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, సిఐటియు నాయకులు టి.లక్ష్మణరావు, లంకా సురేంద్ర, ఆర్.కొండ, లంకపల్లి లాజర్, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి సిపిఎం కార్యాలయంలో భగతసింగ్ చిత్రపటానికి సిపిఎం నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరావు, వంగల రాజు, వీరబాబు, బొడ్డు నాగరాజు, లంక దాసుల అజాయిఘోష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మండలంలోని అవురిపూడి గ్రామంలో కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు. మొవ్వ మండల సిఐటియు వైస్ ప్రెసిడెంట్ ఏనుగ శ్రీనివాసరావు (కొండ), భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామస్తులు, విద్యార్థి విద్యార్థులతో కలిసి స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు, సాయికుమార్, బాబి, దామోదరం, మణికంత, విక్రం, అశోక్, నారాయణ, వెంకట దుర్గారావు, మాగంటి శ్రీను పాల్గొన్నారు.



గుడివాడలో...




బంటుమిల్లిలో...



మొవ్వ మండలంలో...



ఉంగుటూరు మండలంలో...



చల్లపల్లిలో...

లయన్స్ క్లబ్ ద్వారా మరిన్ని సేవలు



ప్రజాశక్తి-కంకిపాడు : ప్రజలకు మరెన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు లయన్స్ క్లబ్ ముందు ఉంటుందని లయన్స్ జిల్లా గవర్నర్ గద్దే శేషగిరి అన్నారు. కంకిపాడులో జరిగిన లయన్స్ క్లబ్ 42వ వార్షికోత్సవ గవర్నర్ విజిట్ డే సభలో శేషగిరి పాల్గొని ప్రసంగించారు. గతం లో పనిచేసిన క్లబ్ ప్రతినిధులను గవర్నర్, గేట్ సభ్యులు సన్మానించారు.క్లబ్ అధ్యక్షుడు వన్నాల రామకష్ణ, సీనియర్ ప్రతినిధి మద్దుల గోవిందరావు, ప్రతినిధి బండి నాంచారయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పావనగిరి మాత ఉత్సవాలు

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని పోలుకొండలో ఘనంగా జరుగుతున్న పావనగిరి మాత ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం రాత్రి పాల్గొన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాముకు ఉత్సవ కమిటీ పెద్దలు, మండల టిడిపి నాయకులు, పోలుకొండ గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే రాము, పాల్గొన్నారు. మండల టిడిపి నాయకులు ఉప్పల వెంకటేశ్వరరావు, అరికెపూడి రామశాస్త్రి, సర్పంచ్ ఝాన్సీ, తమ్మారెడ్డి శ్రీను, కుర్మా శ్రీను, చాట్రగడ్డ రవి, డీసీ యేసుబాబు, యేసుపాదం, పి. చిన్నబాబు, ఫాదర్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సమస్యల స్వాగతం

- **మౌలిక సదుపాయలు లేక ప్రజల ఇబ్బందులు**

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని కొత్త మాజేరు పంచాయతీలో నిర్మాణం జరిగిన జగనన్న, చంద్రన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఎక్కడ చూసినా వెళ్ళు దుబ్బులు పెరిగి కాలనీవాసులకు స్వాగతం పలుకుతున్నాయి. నీటి కుళాయిలు అలంకారప్రాయంగా ఉన్నాయి. కాలనీలో మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. పూర్తికాని గహాలు లబ్ధిదారుల పేదరికాన్ని గుర్తుచేస్తున్నాయి. కాలనీలో రోడ్లు లేకపోవడంతో వర్షాకాలము మోకాలు లోతు నీరు నిల్వ ఉంటుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జగనన్న కాలనీలో 47 మందికి ఇల్లు మంజూరు అయ్యాయి. వీరంతా నిరుపేద వ్యవసాయ కార్మికులు కావున ఇళ్ళ నిర్మాణానికి ఆర్థిక పరిస్థితులు వెసులుబాటలేక గ్రామ ప్రముఖునకు ఇళ్ళ నిర్మాణ బాధ్యతలు అప్పజెప్పికొంత నగదు ముట్ట చెప్పినట్లు గహ లబ్దిదారులు తెలిపారు. అయినా గహాల నిర్మాణం పూర్తి చేయకుండానే వదిలి వేయటంతో ప్రైవేట్ వ్యక్తుల నుండి రుణాలు తీసుకొని ఇళ్ళు పూర్తి చేసుకున్నట్లు వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు బయట వ్యక్తుల నుండి అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి గహాలు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. గహ నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక, రుణభారం మోయలేక అప్పులు తీర్చే మార్గము లేక సతమతమవుతున్నావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గహ నిర్మాణాలు పూర్తి అయితే బిల్లులు వస్తాయి అని ఆశపడి అప్పులు చేస్తే రావాల్సిన బిల్లులు కూడా రాలేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఆగిపోయిన ఇళ్ల మధ్య, రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలలో రెల్లి దుబ్బులు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారాయ ని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా విష సర్పాలు కాలనీలో సంచరిస్తున్నాయని, చిన్నపిల్లలు ఇంటిదగ్గర వదిలి వెళ్లాలంటే భయపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ఒక్కపూట మాత్రమే తాగు నీరు సరఫరా చేస్తారని, ఆ నీరు కూడా తాగటానికి పనికిరాదని అన్నారు. కిలోమీటర్ దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి కాలనీవాసులకు ఏర్పడిందని మహిళలు వాపోతున్నారు. కాలనీలో అంతర్గత రోడ్లు అభివద్ధి చేయాలని, ఆగిపోయిన గహ నిర్మాణ బిల్లులు విడుదల చేయాలని, కాలనీవాసులకు రక్షిత తాగునీరు అందించాలని కాలనీ వాసులు పాలకులను కోరుతున్నారు.



కాలనీలో దట్టంగా పెరిగిన రెల్లుగడ్డి



నవజీవన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యా, సాంస్కతిక వికాసానికి నవజీవన్ విద్యాసంస్థలు దోహదపడు తున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. శనివారం రాత్రి అవనిగడ్డలోని నవజీవన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 41 వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సహజ సిద్ధమైన సృనాత్మకతను వెలికి తీసి విద్యార్థులను తీర్చిదిద్దే స్థాయిలో నవజీవన్ విద్యాసంస్థ కషి చేస్తుందన్నారు. మందలో ఒకరిగా కాకుండా వందలో ఒకరిగా ఉండాలన్న స్వామి వివేకానంద బోధనలను విద్యార్థులు ఆచరిస్తూ పురోగమించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. నవజీవన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కొండవీటి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏవో జయలక్ష్మి, ప్రముఖ వ్యక్తిత్వ వికాసం ఇపునులు డాక్టర్ గమనం, మతి శ్రీనివాసరావు, గుడిసె విష్ణు ప్రసాద్, ప్రిన్సిపాల్ పసుపులేటి అమర్నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : సామాజిక సేవాకార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముందంజలో ఉంటారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చినఓగిరాల సులాభి వద్ద మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల వెంకట కుటుంబరావు, మండల యువత నాయకుడు తుమ్మల హరీశ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మండల పార్టీ అ ధ్యక్షుడు కుటుంబరావు, తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఉయ్యూరు ప్రభుత్వ వైద్య శాల అభివద్ధి కమిటీ చైర్మన్ జయదేవ్, జబర్లపూడి సర్పంచ్ సూరప నేని శేష వరప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సంపటాలమ్మ గ్రామ సంచారం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి గ్రామ దేవత, సంపటాలమ్మ అమ్మవారి గ్రామసంచారం వైభవంగా ప్రారంభమైంది. తొలుత ఆలయంలో ఆలయ వంశపారంపర్య పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అమ్మవారి పుట్టింటి వారైన పత్తిపాటి వారు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ సంచారానికి అమ్మవారి ఘటం బిందెను ఆలయం నుంచీ బయటకు తీసుకురాగా డప్పు వాయిద్యాల హోరులో అమ్మవారి జయజయ ధ్వానాల నడుమ అమ్మవారు గ్రామసంచారానికి బయలుదేరారు. కోటేశ్వరరావు కుమారులు చల్లపల్లి నరేష్, పూర్ణలు అమ్మవారి ఘటం బిందెను శిరస్సున ఉంచుకుని గ్రామంలో సంచరించగా భక్తులు అమ్మవారికి వారు పోసి పసుపు కుంకుమలు సమర్పించారు. చల్లపల్లి మునసబ్ గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు విన్నకోట శంకర్, పత్తిపాటి రత్నం పాల్గొన్నారు.



ఉత్సాహంగా యమహా 'ది కాల్ ఆఫ్ ది బ్లూ' ఈవెంట్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యమహా మోటార్ ప్రైవేట్ లిమిటెడ్ తన ప్రతిష్టాత్మక బ్రాండ్ క్యాంపెయిన్ ది కాల్ ఆఫ్ ది బ్లూను ఆదివారం నగరంలో పార్క్ పార్కింగ్ ప్రాంతంలో నిర్వహించింది. 700కి పైగా ఉత్సాహభరిత రైడర్లు, ఔత్సాహికులు యమహా ప్రీమియం ద్విచక్ర వాహనాల అద్భుతమైన ప్రపంచాన్ని ఆస్వాదించేందుకు హాజరై, వేదికను ఉత్సాహంతో నింపారు. ఈ కార్యక్రమం యమహా అత్యాధునిక సాంకేతికత, విశిష్టమైన పనితీరు, అధునాతన భద్రతా ఫీచర్లను దాని విభిన్న ఉత్పత్తి శ్రేణి ద్వారా ప్రదర్శిస్తూ అత్యుత్తమ అనుభవాన్ని అందించింది. జింఖానా రైడ్, ఉడెన్ ప్లాంక్ ఛాలెంజ్, స్లో బ్యాలెన్సింగ్ వంటి రైడింగ్ పరీక్షల్లో ఔత్సాహికులు తమ నైపుణ్యాలను పరీక్షించుకోగా, వారి రైడింగ్ టెక్నిక్‌లను మెరుగుపరచడంలో బ్రాండ్ నిపుణుల మార్గదర్శకత్వాన్ని అందుకుంది. ఈ డైనమిక్ ప్లాట్‌ఫామ్ మోటార్‌సైక్లింగ్ ఔత్సాహికులను ఒకచోట చేర్చి, యమహా పట్ల వారి అభిరుచిని మరింత బలపరుస్తూ, ఉల్లాసభరితమైన అనుభూతిని అందించింది.



బిల్డింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సబ్కా కృష్ణా (స్టేట్ అఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా శాఖ) నూతన కార్యవర్గాన్ని లబ్బీపేటలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కలిదిండి కృష్ణంరాజు, సబ్కా కృష్ణ అధ్యక్షులుగా మండవ సాయి, కార్యదర్శిగా లింగం రవికిరణ్, ఉపాధ్యక్షులుగా కోటిరెడ్డి, మురళీధర్, ట్రెజరర్‌గా వెంకటేశ్వరరాజు, జాయింట్ సెక్రటరీలుగా రవికుమార్, సురేష్ కుమార్, భూపతి రెడ్డి, ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పూర్ణ, శ్రీధర్, వీరబ్రహ్మం, శ్రీనివాసరెడ్డి, శేషగిరి రావు, శ్రీనివాసరావు, హరికృష్ణ అడ్వైసర్స్‌గా సకలారెడ్డి, రత్నారావు, అమర్ బాబు, సుధీర్‌ను ఎన్నుకున్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

విజయవాడ : నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని ఇండియన్ అంబేద్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసికోని యెడల ప్రభుత్వం అండతో ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రజలు విశ్వ సిస్తారని అన్నారు. వెంటనే బాధ్యులను శిక్షించాలని డాక్టర్ తారకప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అత్యాధునిక వైద్యం అందుబాటులోకి తేవాలి

నూతన చికిత్సా విధానం 'రెజ్యూమ్' ప్రారంభంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అత్యాధునిక వైద్య సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. నగరంలోని ప్రశాంత్ హాస్పిటల్లో, ప్రొస్టేట్ సమస్యలకు అందుబాటులోకి వచ్చిన విప్లవాత్మక చికిత్సా విధానం 'రెజ్యూమ్'ను రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్‌తో కలసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా అందుబాటులోకి వచ్చిన ఈ ఆధునిక చికిత్సతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడం సాధ్యమవుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవను మరింత విస్తరించి పేద ప్రజలకు సైతం అత్యున్నత స్థాయి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. ప్రశాంత్ హాస్పిటల్ ఆవిష్కరించిన 'రెజ్యూమ్' ప్రొస్టేట్ సంబంధిత వ్యాధుల చికిత్సలో గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం, ప్రశాంత్ హాస్పిటల్ చైర్మన్, ప్రఖ్యాత యూరాలజిస్ట్ డాక్టర్ కె.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రొస్టేట్ సమస్యలకు సంబంధించిన అన్ని వ్యాధులకు దేశంలోని మొట్టమొదటి సమగ్ర చికిత్సా విభాగంగా ప్రశాంత్ హాస్పిటల్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రొస్టేట్ సంబంధిత సమస్యలన్నింటికీ పరిష్కారంగా విప్లవాత్మకమైన రెజ్యూమ్ వాటర్ థెరపీని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ చికిత్స యుఎస్ఎఫ్‌డిఎ ఆమోదితమైన, అత్యంత సరళతరమైన అత్యాధునిక చికిత్స అని తెలిపారు. ఈ రెజ్యూమ్ థెరపీ బిహెచ్‌పి చికిత్సల్లో అతి పెద్ద మార్పు తీసుకు వస్తుందని చెప్పారు. రెజ్యూమ్ వాటర్ థెరపీలో, పెద్ద శస్త్రచికిత్స అవసరం లేదని, జనరల్ అనస్థీషియా కూడా అవసరం ఉండదని అన్నారు. దీర్ఘకాలిక మందులు వాడాల్సిన అవసరం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ థెరపీ ద్వారా నీటి ఆవిరిని ఉపయోగించి ప్రొస్టేట్ గడ్డలను తగ్గించడం ద్వారా, మూత్ర సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ థెరపీ ద్వారా ఇది రోగులకు సురక్షితంగా, వేగంగా, జీవిత నాణ్యతను కాపాడుతూ చికిత్స అందించవచ్చని డాక్టర్ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ కె. ధీరజ్, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ కె. ప్రీతమ్, యూరో గైనకాలజిస్ట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పి. హరిత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ అండ్ ఫీటల్ మెడిసిన్ ఎక్స్పర్ట్ డాక్టర్ శ్వేత సీవోవో బి. రమేష్, నగరంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్



ఉమ్మడి కృష్ణా రగ్బీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఉమ్మడి కృష్ణా జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ పురుషుల, మహిళల జిల్లా రగ్బీ జట్ల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు 25 మంది బాలురు, 20 మంది బాలికలు పాల్గొన్నారని కార్యదర్శి ఎన్ చంద్రకళ తెలిపారు. పురుషుల జట్టుకు జి.బిళ్ళ హరి, సిహెచ్.మోహన వంశీ, ఎం.లక్ష్మి నారాయణ, (విజయవాడ), వై.జిక్రిరెడ్డి (జూనియర్ కళాశాల, పాయకాపురం), కె.రాహుల్ (ధనేకుల), నున్న వికాస్‌కి చెందిన పి.సాయి ధనుష్, యు.వెంకట రమణ, ఎం.డి.ఫిరోజ్ జిలానీలు, ఎం.లక్ష్మణ స్వామి (సంగ మూడి), పి.రవి నాగ శంకర్‌లు ఎంపికయ్యారు. మహిళల జట్టుకు ఉంగుటూరుకు చెందిన వై.నందిని, ఎస్.కీర్తన, ఓ.సుధారాణి, కె.నందిని, జి.గంగా భవానీ (హనుమాన్ జంక్షన్), విజయవాడకు చెందిన వి.గీతశ్రీ, బి.నిహారిక, సిహెచ్.జాహ్నవి, డి.చిన్ని, నున్నకు చెందిన ఎ.గౌతమి, పి.జెస్సికా ఎంపికయ్యారని చంద్ర కళ తెలిపారు. ఎంపికలు వ్యాయామ ఉపాధ్యాయులు జి.రాంబాబు,టి.శ్రీ లత, నరసింహ నిర్వహించారు.

క్రెడాయ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దాసరి రాంబాబు ఏకగ్రీవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నేడు విశాఖపట్నం నగరంలో జరిగిన క్రెడాయి ఆంధ్ర ప్రదేశ్ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో విజయవాడకు చెందిన దాసరి రాంబాబు క్రెడాయ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. సమావేశం అనంతరం జరిగిన ఎన్నికల్లో పలువురు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, బుడ్డిగ శ్రీనివాస్ (రాజమండ్రి) చైర్మన్‌గా, బాయన శ్రీనివాస్ (విశాఖపట్నం) అధ్యక్షుడిగా మిగతా ఆఫీసు బేరర్లను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దాసరి రాంబాబును ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఆభినందించారు.





ఆధునీకరించిన సెయింట్ ఆన్స్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆధునీకరించిన కొండపల్లి సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌ను విజయవాడ డయాసిస్ బిషప్ రెవరెండ్ టి.రాజారావు ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ ఈ ప్రాంత వాసులకు అతి తక్కువ ఖర్చుతో సెయింట్ అన్స్ హాస్పిటల్ యాజమాన్యం వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆధునీకరణ చేసి మరిన్ని వైద్యసేవలు ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించే సెయింట్ ఆన్స్ హాస్పిటల్ సేవలను ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సిస్టర్స్ కోరారు.

రామలింగేశ్వర నగర్ రహదారిపై

ఇసుక లోడు లారీలు నియంత్రించాలని ధర్నా

ప్రజాశక్తి -విజయవాడ : ప్రమాదాలకు నిలయంగా మారిన రామలింగేశ్వరనగర్ ప్రధాన రహదారిపై భారీ స్థాయి ఇసుక లోడు లారీలను నియంత్రించాలని కోరుతూ డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ నేతృత్వంలో స్థానిక ప్రజలు ఆదివారం రహదారిపై పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. దీంతో రహదారిపై రాకపోకలు భారీ సంఖ్యలో నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ... నిత్యం జనం, వాహనాల రాకపోకలతో రామలింగేశ్వర్‌నగర్ ప్రధాన రహదారి రద్దీ పెరిగిపోతూ... పలు ప్రమాదాలకు నిలయంగా మారిందని పేర్కొన్నారు. స్కూల్స్ విద్యార్థులు, వృద్ధులు ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు. రహదారి ప్రమాదాలపై సంబంధిత అధికారులకు పలు సార్లు చెప్పినా కానీ పట్టించుకోవడం లేదని అన్నారు. నిత్యం వందల సంఖ్యలో ఇసుక లోడు లారీలు ఈ రహదారి నుంచే వెళ్తున్నందున రద్దీ పెరిగిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికయినా ఇసుక లోడు లారీలను సంబంధిత ట్రాఫిక్ పోలీసులు నియంత్రించాలని కోరారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారి రామారావుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, స్థానిక నాయకులు భుజంగరావు, నూకలసత్యనారాయణ, చిగురుకోట పూర్ణచంద్రరావు, కేలం చంటి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న డిప్యూటీ మేయర్ దుర్గ, తదితరులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : శ్రీ చైతన్య విద్యా సంస్థలు ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం నగరంలోని గాయత్రీనగర్ చైతన్య విద్యాసంస్థ ప్రాంగణంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేశారు. ఈ వైద్య శిబిరాన్ని శ్రీ చైతన్య విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మురళీ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థలో పనిచేసే సిబ్బంది అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో ఇసిజి, 2డి ఎకో, షుగర్, బి.పి, థైరాయిడ్, వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో పాల్గొని సేవలు పొందిన వారికి శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సీమా, నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మురళీ కృష్ణ